సాక్షి విశాఖపట్నం

శనివారం ၊ 21 ၊ జనవరి ၊ 2023



నేడే అప్పన్న తెప్పోత్సవం

పుష్యబహుళ అమావాస్య పురస్కరించుకుని వరాహ లక్ష్మీనృసింహస్వామి తెప్పోత్సవం శనివారం కొండదిగువ వరాహ పుష్కరిణిలో జరగనుంది.

IIలో



ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించండి

IIలో



అభివృద్ధి పనులకు స్థాయీ సంఘం ఆమోదం

జీవీఎంసీ పరిధిలో అభివృద్ధి పనులకు స్థాయీ సంఘం సభ్యులు ఆమోదం తెలిపారు.

IIలో

భవిష్యత్తు విశాఖదే..

- వైజాగ్ వేదికగా ఇన్ఫినిటీ ఐటీ సమ్మిట్–2023
- హాజరైన దిగ్గజ ఐటీ సంస్థల ప్రతినిధులు



స్టాళ్లను పరిశీలిస్తున్న కేంద్ర ఐటీ శాఖ కార్యదర్శి అల్కేష్‌కుమార్ శర్మ, ఎస్టీపీఐ జాయింట్ డైరెక్టర్ అరవింద్‌కుమార్, రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి సౌరభ్‌గౌర్, ఐటాప్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ కొసరాజు

మద్దిలపాలెం (విశాఖ పశ్చిమ): దేశంలోని ద్వితీయ శ్రేణి నగరాల్లో కీలకంగా వ్యవహరిస్తున్న విశాఖ వైపు.. దిగ్గజ సంస్థలు క్యూ కడుతున్న నేపథ్యంలో.. ఐటీ రంగానికి కేంద్ర బిందువుగా నగరాన్ని మార్చే దిశగా అడుగులు వేసేందుకు వైజాగ్ వేదికగా అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇన్ఫినిటీ ఐటీ సమ్మిట్–2023 పేరుతో నిర్వహిస్తున్న ఈ సదస్సులో 60కి పైగా ఐటీ సంస్థలు ప్రతినిధులు హాజరయ్యారు. ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమలకు హబ్‌గా త్వరలోనే అభివృద్ధి చెందేందుకు విశాఖపట్నంలో అపారమైన అవకాశాలున్నా యని ప్రపంచానికి చాటిచెప్పేందుకు ఈ సదస్సు వేదికగా నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఐటీ అసోసియేషన్‌ఆఫ్ ఏపీ(ఐటాప్), సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా(ఎస్టీపీఐ)తో పాటు వివిధ సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న సదస్సుని కేంద్ర ఐటీ శాఖ కార్యదర్శి అల్కేష్‌కుమార్‌శర్మ, రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి సౌరభ్‌గౌర్, ఎస్టీపీఐ డైరెక్టర్ జనరల్ అరవింద్ కుమార్, సెయింట్ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, ఐటాప్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ కొసరాజు ప్రారంభించారు. ఐటీ బూమ్ ఉన్న సమయంలో దిగ్గజ సంస్థలన్నీ టైర్–1 నగరాలపైనే దృష్టిసారించి.. తమ కార్యకలాపాలు విస్తరింపజేసుకు దిశగా సంస్థలు అడుగులు వేయాలని అంతా పిలుపునిచ్చారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా.. భవిష్యత్తు కాలంలో కీలకంగా వ్యవహరించనున్నా కృత్రిమ మేథ, ఇండస్ట్రీ 4.0, వెబ్ 3.0 తదితర రంగాల అభివృద్ధికి ఉన్న వనరులు, వసతులు, స్టార్టప్ సంస్థల ఏర్పాటుకు ఉన్న అవకాశాల గురించి తొలిరోజున ఐటీ రంగ నిపుణులు, ప్రభుత్వ ప్రతినిధులు, ప్రముఖ ఐటీ సంస్థల ప్రతినిధులు చర్చించారు. విశాఖలో ఐటీ రంగంలో అవకాశాలు, వనరులు, బిజినెస్ టూ బిజినెస్ నెట్‌వర్కింగ్ అవకాశాలు, స్టార్టప్‌లు మొదలైన అంశాలపై ప్యానల్ డిస్కషన్స్ నిర్వహించారు. ఐటీ, ఐటీ ఆధారిత ఎగుమతులకు సంబంధించి విశాఖకు ఉజ్వల భవిష్యత్తు ఉందని స్పష్టం చేశారు. ఇండస్ట్రీ 4.0, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, వెబ్ 3.0.. ఆవిష్కరణలు, డీప్‌టెక్ డొమైన్... తదితర రంగాల్లో ఏపీలోని ఐటీ రంగాన్ని అగ్రగామిగా నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోందని ప్రభుత్వ ప్రతినిధులు ఐటీ సంస్థల ప్రతినిధులకు వివరించారు.

ఐటీ స్టాళ్లు.. భళా!

రాష్ట్రంలో ఐటీ రంగానికి సంబంధించి పెట్టుబడుల అవకాశాలపై ఏర్పాటు చేసిన ఇన్ఫినిటీ వైజాగ్ సదస్సు మారియట్ హోటల్లో శుక్రవారం ప్రారంభమైంది. సదస్సులో భాగంగా సాఫ్ట్‌వేర్ కంపెనీలు తమ స్టాళ్లను ఏర్పాటు చేశాయి. అందులో కొన్ని స్టాళ్ల వివరాలివీ..

- సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ ఆఫ్ ఇండియా(ఎస్టీపీఐ). ఇది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ సంస్థ. స్టార్టప్ కంపెనీ పెట్టాలనుకునే వారిని ఈ సంస్థ ప్రోత్సహిస్తుంది. వారి అర్హతల అనుగుణంగా ఇంక్యుబేషన్, ప్రమోషన్, సాఫ్ట్‌వేర్, ఫండింగ్ తదితర అంశాలపై సహకరిస్తుంది.
- మారీటెక్ సంస్థ 2005లో స్టార్టప్ కంపెనీగా ఏర్పడింది. ప్రస్తుతం 5వేల మంది ఉద్యోగులతో పెద్ద సంస్థగా ఎదిగింది. ఇది ఒక డేటా ఆధారిత సంస్థ
- ఎపిటా అనే సంస్థ ప్రభుత్వంలో ఉన్న అన్ని సంస్థలకీ ఇంటర్నెట్, కంపెనీకి కావాల్సిన ఐటీ సర్వీసెస్ అందిస్తుంది.
- ఎఫ్‌ట్రానిక్స్ చిన్న సంస్థగా ఏర్పడి ఐవోటీ(ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్) సేవలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సేవలు అందించడంలో విశేషంగా రాణిస్తోంది. ఈ సంస్థ ద్వారా ఆటోమేటిక్‌గా పనులు జరుగుతాయి. ఉదాహరణకు ఓ గదిలోకి ఎవరైనా ప్రవేశిస్తే ఆటోమేటిక్‌గా దీపం వెలుగుతుంది. బయటకు వచ్చేస్తే ఆ లైట్ ఆగిపోతుంది.
- అమ్‌జూర్.. ఇది ఓ సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ సర్వీసెస్ కంపెనీ. 2020లో స్థాపించారు. ప్రస్తుతం ఇందులో 100 మంది ఉద్యోగులు ఉన్నారు. డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ రూపంలో లావాదేవీలు జరగడానికి ఈ సంస్థ సహకరిస్తుంది.
- ఫ్లూయంట్‌గ్రిడ్..ఇది ఒక అనలిటిక్స్ కాన్సెప్ట్. ప్రస్తుతం ఉన్న స్టార్టప్ కంపెనీలు, అలాగే పెద్ద సంస్థలన్నీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్, ఐవోటీఎస్, అనలిటిక్స్‌ను ఉపయోగిస్తున్నాయి. ఇది ఎలా పనిచేస్తుందంటే.. ఉదాహరణకు ఓ పడవలో ప్రయాణిస్తున్నప్పుడు సముద్రంలో ఎంత కాలుష్యం ఉంది అనేది ప్రయాణించేవారికి తెలియదు. ఐవోటీఎస్ సెన్సార్‌తో సముద్రగర్భంలో ఉన్న కాలుష్యాన్ని గ్రహించి, ఆ డేటా మొత్తాన్ని అనలిటిక్స్‌లో చూపిస్తుంది.
- ఇటీవల స్థాపించిన సంస్థ ఐఎంఈజీ. డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్‌లోకి అడుగుపెడుతోంది.

స్టాఫ్ నర్సుల ఎంపికలో అక్రమాలు?



ప్రిన్సిపల్ ట్రైనింగ్ స్కూల్ ఎదుట ఆందోళన చేస్తున్న స్టాఫ్ నర్సు అభ్యర్థులు

- చక్రం తిప్పిన ఇద్దరు ఉద్యోగులు
- అభ్యర్థుల నుంచి భారీగా వసూళ్లు!
- ఓ జాబితాలో ఉన్న పేరు.. మరో జాబితాలో గల్లంతు
- విచారణ చేపట్టాలని నిరుద్యోగుల డిమాండ్

మహారాణిపేట(విశాఖ దక్షిణ): స్టాఫ్ నర్సు పోస్టుల ఎంపిక ప్రక్రియ అక్రమాలకు అడ్డాగా నిలిచింది. వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులు చక్రం తిప్పి అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిరుద్యోగ అభ్యర్థుల నుంచి రూ.3 లక్షల నుంచి రూ.4లక్షల చొప్పున వసూలు చేసినట్లు సమాచారం. కొంత మంది అభ్యర్థులకు ఉద్యోగాలతోపాటు అనుకున్న ప్రాంతంలో పోస్టింగ్ వచ్చే విధంగా చేస్తామని వారి నుంచి భారీగా దండుకున్నట్లు తెలిసింది. ఆ ఇద్దరు నిర్వాకం వల్ల దరఖాస్తు చేసిన అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఓ జాబితాలో పేరు ఉండడం, మరో జాబితాలో పేరు లేకపోవడం వంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. అనుకోకుండా పోస్టులు పెరగడం, కోవిడ్ సమయంలో పని చేసిన వారికి వెయిటేజ్ మార్కులు కలపడం వంటి చర్యలు ఆ ఇద్దరి ఉద్యోగులకు కలిసి వచ్చాయి. దీంతో తమకున్న పరిచయాల ద్వారా ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన అభ్యర్థుల నుంచి భారీగా డబ్బులు గుంజినట్లు తెలిసింది. వీరికి అదే శాఖలో అధికారులు పూర్తి సహాయ సహకారాలు అందించడం వల్ల జాబితాలో అనర్హులకు చోటు దక్కింది. అవసరం అయిన వారికి వెయిటేజ్ మార్కులు కలపకపోవడం, ఎలాంటి అర్హతలు లేని వారికి మార్కులు కలిపి అందలం ఎక్కించడం వంటి చర్యతో తుది జాబితా తప్పులు తడకలతో నిండిపోయింది.

కొంప ముంచిన రహస్యం : పోస్టుల భర్తీ ప్రక్రియలో మొదటి నుంచి అన్ని రహస్యంగా ఉంచడం వల్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయంలో సిబ్బంది.. వివరాలు బయటకు చెప్పడానికి ఇష్టపడే వారు కాదు. ఆ కార్యాలయంలోని ఇద్దరు, ముగ్గురు ఉద్యోగులు మొత్తం జాబితాను సిద్ధం చేసి.. వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ వద్దకు తీసుకెళ్లారు. 179 పోస్టులకు 172 మందితో జాబితా విడుదల చేశారు. మిగిలిన పోస్టులు ఎందుకు పెండింగ్‌లో ఉంచారన్న దానిపై పొంతన లేని సమాధానాలు చెప్పుకొచ్చారు. సరైన సమాచారం లేకపోవడం వల్ల శుక్రవారం జరిగిన కౌన్సెలింగ్‌కు 36 మంది అభ్యర్థులు హజరు కాలేకపోయారు.

136 మంది హాజరు : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ఆవరణలోని ట్రైనింగ్ స్కూల్ ప్రిన్సిపల్ కార్యాలయంలో అభ్యర్థుల ఆందోళనల మధ్య.. ఎట్టకేలకు స్టాఫ్ నర్సుల భర్తీ ప్రక్రియ కొనసాగింది. మొత్తం 179 పోస్టులకు గానూ 172 మంది అభ్యర్థులతో జాబితా ప్రకటించగా.. 136 మంది అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఎనిమిది మంది పోస్టుల్లో చేరేందుకు అయిష్టత చూపిస్తూ లేఖలు ఇచ్చారు. 36 మంది అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కాలేదని వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ డైరెక్టర్(ఆర్డీ) ఉమాసుందరి తెలిపారు. కౌన్సెలింగ్ పూర్తి చేసిన వారికి నియామక ఉత్తర్వులు అందజేసినట్లు చెప్పారు.

ఏడు పోస్టులు పెండింగ్ : మొత్తం 179 పోస్టులకు గానూ 172 మందితో జాబితా ప్రకటించారు. ఏడు పోస్టులకు అభ్యర్థులు లేకపోవడం వల్ల పెండింగ్‌లో పెట్టారు. విమ్స్‌లో 24 పోస్టులకు గానూ 18, వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో 108 పోస్టులకు గానూ 81, ఏపీ వైద్య విధాన పరిషత్ పరిధిలో 47 పోస్టులకు గానూ 29 పోస్టులను భర్తీ చేసినట్లు ఆర్డీ తెలిపారు. ఏడు పోస్టులకు అర్హులైన అభ్యర్థులు లేకపోవడం వల్ల పెండింగ్‌లో పెట్టినట్లు చెప్పారు.

అభ్యర్థుల ఆందోళన

జాబితా ప్రకారం మొత్తం 172 మంది అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు రావాల్సి ఉంది. కానీ మొదటి, రెండో, మూడో జాబితాలో పేర్లు ఉన్న అభ్యర్థులు శుక్రవారం ట్రైనింగ్ స్కూల్ ప్రిన్సిపల్ కార్యాలయానికి తరలివచ్చారు. మొత్తం 400 మందికి పైగా అభ్యర్థులు కౌన్సెలింగ్ జరగకుండా అడ్డుపడ్డారు. అనర్హులతో నిండిన జాబితా విడుదల చేశారని.. అర్హులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పిస్తుంటే.. సిబ్బంది అక్రమాలకు పాల్పడడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపికైన అభ్యర్థులను లోపలకు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సెలింగ్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అరుపులు, కేకలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. చివరకు పోలీసులు రంగ ప్రవేశం చేసి అభ్యర్థులను అదుపు చేశారు. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత కౌన్సెలింగ్ ప్రారంభమైంది. 17న నిర్వహించిన కౌన్సెలింగ్ సమయంలో నిరుద్యోగ అభ్యర్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో.. అమరావతి నుంచి వైద్య ఆరోగ్యశాఖాధికారులు రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దారు. జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి.. ప్రభుత్వ జీవో, రోస్టర్ పాయింట్ల ప్రకారం కొత్త జాబితా రూపొందించారు.

న్యూస్‌రీల్

రోజూ నడకతో ఆరోగ్యం

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



ర్యాలీలో పాల్గొన్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): రోజూ ఉదయం పూట నడవటం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చని భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు ఎస్.ఆళ్వార్‌దాస్ 20వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం బీచ్‌రోడ్డులో ర్యాలీ జరిగింది. ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ ర్యాలీని వెంకయ్యనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఒత్తిడుల మధ్య మనిషి ఆరోగ్యానికి సమయం కేటాయించలేకపోతున్నాడని.. అందువలన అనారోగ్యానికి గురవుతున్నాడని చెప్పారు. తాను ఎంత బిజీగా ఉన్నా.. వాకింగ్‌కు సమయం కేటాయిస్తానని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం కోసం రోజూ వ్యాయామం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఎస్.పి.రవీంద్ర, మాజీ అధ్యక్షుడు వెంకటరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 11న మెగా లోక్ అదాలత్

విశాఖ,లీగల్: జాతీయ న్యాయసేవా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఫిబ్రవరి 11న మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తల గోపి తెలిపారు. ఈమేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో ఈ అదాలత్ జరుగుతుంది. ఇందులో రాజీ కాగలిగిన సివిల్, క్రిమినల్, పూర్వ ప్రాథమిక కేసులు విచారణ జరిపి ఇరువర్గాల కక్షిదారులకు ఆమోదయోగ్యమైతే రాజీ చేస్తారు. విడాకుల కేసులు ఈఅదాలత్ పరిధిలోని రావు. కుటుంబ న్యాయ స్థానం పరిధిలోని కొన్ని కేసులు కూడా విచారించరు. చెల్లని చెక్కులు, వాహన ప్రమాదాలు, బీమా కంపెనీలు, కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు సంబంధించిన కేసులు ,కార్మికుల చట్ట పరిధిలోనివి, మహానగరపాలక సంస్థ, పోర్టు, బ్యాంకులు ప్రభుత్వ, ఇతర సంస్థల కేసులు రాజీ చేస్తారు. ఇతర వివరాలకు జిల్లా కోర్టులోని న్యాయసేవా సంస్థ కార్యదర్శి కేకేవీ బులికృష్ణను సంప్రదించాలని ఆయన కోరారు.

నీటి నిల్వలు పుష్కలం

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): జీవీఎంసీలో శుక్రవారం నాటికి నీటి నిల్వలు ఇలా ఉన్నాయి. ఏలేరు రిజర్వాయర్ నీటి మట్టం 86.56 మీటర్లకు గాను ప్రస్తుతం 83.35 మీటర్లకు చేరుకుంది. గోదావరి నదీ జలాల నీటి మట్టం 18 మీటర్లకు గాను 13.60 మీటర్లు, రైవాడ రిజర్వాయర్ నీటి మట్టం 114 మీటర్లకు గాను 111.96 మీటర్లు, మేఘాద్రిగెడ్డ రిజర్వాయర్ నీటిమట్టం 61 అడుగులకు గాను 58.10 అడుగులకు చేరింది. అలాగే తాటిపూడి రిజర్వాయర్ నీటి మట్టం 297 అడుగులకు గాను 295.10 అడుగులు, గంభీరం గెడ్డ రిజర్వాయర్ 126 అడుగులకు గాను 120 అడుగులు, గోస్తనీ నదీ నీటిమట్టం 35 అడుగులకు 29.20 అడుగులు, ముడసర్లోవ రిజర్వాయర్ నీటి మట్టం 169 అడుగులకు ప్రస్తుతం 167.6 అడుగులకు చేరింది. ఈ ఏడాది వేసవికి నగర ప్రజలకు నీటి కొరత లేనట్టేనని జీవీఎంసీ అధికారులు తెలిపారు.

టౌన్‌ప్లానింగ్ స్పందనకు 11 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న పట్టణ ప్రణాళికా అధికారి సురేష్

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి శుక్రవారం నిర్వహించిన స్పందనకు 11 ఫిర్యాదులు వచ్చాయని పట్టణ ప్రణాళికా అధికారి బి.సురేష్ తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని చీఫ్ సిటీ ప్లానర్ చాంబర్ నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భవన నిర్మాణ వ్యర్థాలు, నిబంధనలు ఉల్లంఘన, అనధికార కట్టడాలపై ఫిర్యాదులు అందాయి. జోన్–1 నుంచి ఒకటి, జోన్–2 నుంచి రెండు, జోన్–3 నుంచి రెండు, జోన్–5 నుంచి నాలుగు, జోన్–6 నుంచి ఒకటి, జోన్–8 నుంచి ఒక ఫిర్యాదు అందిందని పట్టణ ప్రణాళికాధికారి సురేష్ తెలిపారు. డీసీపీ–1 కె.పద్మజ, ఏసీపీలు, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కానిస్టేబుళ్ల రాత పరీక్షకు పటిష్ట బందోబస్తు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ శ్రీకాంత్

దొండపర్తి (విశాఖ దక్షిణ): పోలీస్ కానిస్టేబుళ్ల నియామకానికి సంబంధించి ఈ నెల 22వ తేదీన జరగనునన్న ప్రవేశ పరీక్షకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ సి.హెచ్. శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం పరీక్షా కేంద్రాలు, స్ట్రాంగ్ రూంలో ఏర్పాట్లను సీపీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో 97 కేంద్రాల్లో పరీక్ష జరుగుతున్నట్లు తెలిపారు. ఈ పరీక్షకు మొత్తం 54,772 మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు వెల్లడించారు.

ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): పోలీసు కానిస్టేబుళ్ల ప్రవేశ పరీక్షకు హాజరుకానున్న అభ్యర్థుల కోసం ఏపీఎస్ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించనుందని జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలరాజు ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో జరిగే అన్నీ పరీక్షా కేంద్రాలకు ప్రత్యేక బస్సులను నడుపనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'మధ్యాహ్న భోజనం' నాణ్యతలో రాజీవద్దు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ విజయలక్ష్మి, కార్పొరేటర్ కామేశ్వరి

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం రాంజీ ఎస్టేట్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారులతో కలిసి విద్యా శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయలక్ష్మి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి ఆధ్వర్యంలో విజయలక్ష్మి నేరుగా పాఠశాల వాతావరణం, విద్యార్థుల చదువు, క్రమశిక్షణ, బోధన పరిశీలించారు. జగనన్న గోరుముద్ద పథకం కింద అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులకు సూచించారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 120 పాఠశాలల్లో రాంజీ ఎస్టేట్ ప్రాథమిక పాఠశాల ర్యాంకింగ్‌లో ముందంజలో ఉండడం అభినందనీయమన్నారు. అనంతరం పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్స్ ఆఫ్ స్కూల్స్ కె.సువర్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దొరబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి

దొండపర్తి(విశాఖ దక్షిణ): జిల్లాలో ఇద్దరు తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. మహారాణిపేట తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న రమామణికి డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ అనకాపల్లి జిల్లాలో బీజేఆర్ సుజలస్రవంతి ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించింది. అలాగే పద్మనాభం తహసీల్దార్‌గా ఉన్న లోకేశ్వరరావు పదోన్నతిపై ఒంగోలు ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్‌గా పోస్టింగ్ ఇచ్చింది. అలాగే పదోన్నతిపై మాధవి జల్లేపల్లిని విశాఖ దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా నియమించింది.

వైజాగ్ మా సెంటిమెంట్

- దర్శకుడు వంశీ పైడిపల్లి
- నగరంలో వారసుడు చిత్ర యూనిట్ సందడి



వారసుడు చిత్ర యూనిట్

అల్లిపురం (విశాఖ దక్షిణం): వైజాగ్ మా సెంటిమెంట్ అని వారసుడు చిత్ర దర్శకుడు వంశీ పైడిపల్లి అన్నారు. వైజాగ్ వచ్చినప్పుడల్లా నగరంలో సంపత్ వినాయగర్ ఆలయం, సింహాచలం సింహాద్రి అప్పన్న గుడికి వెళ్లడం ఆనవాయితీ అన్నారు. తన సినిమాలన్నీ విశాఖలోనే షూటింగ్‌లు జరుపుకున్నాయన్నారు. భారత్ సూపర్ స్టార్ విజయ్ ఇటువంటి కథ ఒప్పుకోగానే తనకు భయమేసిందన్నారు. వారసుడు చిత్ర యూనిట్ నగరంలోని మెలోడి థియేటర్‌లో శుక్రవారం సాయంత్రం సందడి చేసింది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ వారసుడు తెలుగు, తమిళంలో బ్లాక్ బస్టర్ హిట్ కావడం గర్వంగా ఉందన్నారు. తమన్ సంగీతం సినిమాకు వెన్నెముకగా నిలిచిందన్నారు. సంగీత దర్శకుడు తమన్ మాట్లాడుతూ బృందావనం తరువాత దర్శకుడు వంశీతో మళ్లీ పని చేశానన్నారు. దిల్‌రాజు ఉత్తమ నిర్మాత అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నటి సంగీత, డిస్ట్రిబ్యూటర్ ప్రతినిధి దిల్ శ్రీనివాస్, థియేటర్ మేనేజర్లు గౌరీ శంకర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంతో ఇద్దరికి పునర్జన్మ



విశాఖ ఎయిర్ పోర్టు లాంజ్‌లో తిరుపతి తరలించేందుకు అంబులెన్స్ నుంచి అవయవాన్ని దించుతున్న వైద్య సిబ్బంది



విశాఖ ఎయిర్ పోర్టు నుంచి తిరుపతికి గుండెను తరలిస్తున్న వైద్య బృందం

అక్కిరెడ్డిపాలెం (గాజువాక) : దేవుడు మనిషికి జన్మనిస్తే అవయవదానం చేసి జంజూరు సన్యాసమ్మ ఇద్దరికి పునర్జన్మ నిచ్చింది. ఈ నెల 17వ తేదీన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయమై.. శుక్రవారం బ్రెయిడ్ డెడ్ అయిన సన్యాసమ్మ గుండె, కిడ్నీలు ఇద్దరికి దానం చేసి పుట్టెడు దుఃఖంలోనూ ఆమె కుటుంబ సభ్యులు పెద్ద మనసు చాటుకున్నారు. అమ్మ ప్రేమను ఎవరూ భర్తీ చేయలేరు.. అందుకే మరో కుటుంబంలో ఈ లోటు రాకూడదన్న ఉద్దేశంతోనే తమ తల్లి అవయవాలు దానం చేశామని చైతన్య, జయప్రకాష్ పేర్కొన్నారు. గుండెను తిరుపతిలోని శ్రీ పద్మావతి చిల్డ్రన్ హార్ట్ సెంటర్‌కు తరలించగా..కిడ్నీని స్థానిక పినాకిల్ ఆస్పత్రికి తరలించారు. భెల్ (హెచ్‌పీవీపీ)లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్న జంజూరు ఆనందరావు భార్య సన్యాసమ్మ (48) టౌన్ షిప్‌లో నివాసం ఉంటున్నారు. వీరి ఇద్దరు కుమారులు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లే. సన్యాసమ్మ పెందుర్తి సమీప గ్రామంలో ఉంటున్న బంధువుల ఇంటికి వెళ్లి.. తిరుగు ప్రయాణంలో బైక్‌పై నుంచి పడిపోయింది.

తలకు బలంగా గాయమవడంతో షీలానగర్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు నిర్ధారించారు. అవయవదానానికి కుటుంబ సభ్యుల అనుమతితో ఆస్పత్రి వైద్యులు గ్రీన్ ఛానల్ సొసైటీ, పోలీసుల సహకారంతో ప్రత్యేక ఏర్పాట్లతో అవయవాలను తిరుపతి, విశాఖలోని పినాకిల్ ఆస్పత్రికి తరలించారు.

సమీక్షలతో సమస్యలకు సత్వర పరిష్కారం



అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

- కలెక్టర్ మల్లికార్జున
- భీమిలి నియోజకవర్గ అభివృద్ధి పనులపై సమీక్ష

ఆనందపురం: ప్రజా ప్రతినిధులతో అధికారులు తరచూ సమీక్షలు నిర్వహిస్తే సమస్యల సత్వర పరిష్కారానికి అవకాశం ఏర్పడుతుందని కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున చెప్పారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం భీమిలి నియోజకవర్గంలో అభివృద్ధి పనుల పురోగతిపై ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ నియోజకవర్గంలో రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టిందని వివరించారు. ఆయా ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజా ప్రతినిధులు అధికారులతో కలిసి పనుల పురోగతిపై క్షేత్ర స్థాయి పరిశీలన చేయాలన్నారు. నిధులు దుర్వినియోగం కాకుండా అడ్డకట్ట వేయాలని చెప్పారు. సత్వర అవసరాలను గుర్తించి పనులు చేపట్టాలన్నారు. విధి నిర్వహణలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని అధికారులకు సూచించారు. ప్రారంభించిన పనులు మార్చిలోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ అధికారులు సహకారంతో నియోజకవర్గంలో చాలా పనులు పూర్తి చేయగలిగామన్నారు. ప్రధాన సమస్యలైన పంచగ్రామాల భూ సమస్య, తగరపువలసలో ఆర్టీసీ కాంప్లెక్స్ , పాండ్రంకి వద్ద గోస్తనీనది పై బ్రిడ్జి , రెడ్డిపల్లిలో పీహెచ్‌సీ నిర్మాణ పనుల గురించి ఎమ్మెల్యే ప్రస్తావించారు. అలాగే పద్మనాభంలో జూనియర్ కళాశాల ఏర్పాటు ప్రతిపాదనలను వేగవంతం చేయాలని కోరారు. ఆనందపురం మండలంలోని ముచ్చర్ల, బోని, శిర్లపాలెం, పద్మనాభం మండలంలోని కృష్ణాపురం, బి.తాళ్లవలస, పద్మనాభం గ్రామాల్లో ఇనాం రైతులకు త్వరితగతిన పట్టాలు మంజూరు చేయాలని కోరారు. జగనన్న కాలనీల్లో మౌలిక సౌకర్యాలు కల్పనకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

పలువురు నాయకులు ప్రస్తావించిన అంశాలు

ముచ్చర్ల గ్రామానికి సచివాలయం , ఆనందపురం జంక్షన్‌లో ప్రమాద భరితంగా మారిన ట్రాఫిక్ నియంత్రణ కోసం రోడ్ల పునర్నిర్మాణం చేయాలని కోరారు. వేములవలస కాలనీ ఇళ్ల సమస్య, తగరపువలస బైపాస్ రోడ్‌లో నీరు నిలిచిపోతుందని... ఐటీ బీపీ భూ బాధితులకు పరిహారం చెల్లించాలని పలువురు నాయకులు కలెక్టర్‌కు వినతి పత్రాలు సమర్పించారు. సమావేశంలో ఆర్డీవో భాస్కరరెడ్డి, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, డ్వామా పీడీ సందీప్, జెడ్పీటీసీలు కోరాడ వెంకటరావు, సుంకరి గిరిబాబు, గాడు వెంకటప్పడు, ఎంపీపీలు కంటుబోతు రాంబాబు, దంతులూరి వాసురాజు, మజ్జి వెంకటరావు, నాయకులు కాకర్లపూడి వరహాలరాజు, యలమంచిలి సూర్యనారాయణ, బోని అప్పలనాయుడు, బంక సత్యం, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడే అప్పన్న తెప్పోత్సవం

సింహాచలం: పుష్యబహుళ అమావాస్య పురస్కరించుకుని వరాహ లక్ష్మీనృసింహస్వామి తెప్పోత్సవం (నౌకా విహారం) శనివారం సాయంత్రం కొండదిగువ వరాహ పుష్కరిణిలో జరగనుంది. హంసాకారంలో రూపొందించిన తెప్పపై స్వామివారు ఉభయదేవేరులతో కలిసి నౌకా విహారం చేయనున్నారు.

విశేషంగా ఏర్పాట్లు : తెప్పోత్సవం పురస్కరించుకుని సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు విశేషంగా ఏర్పాట్లు చేశారు. స్వామి విహరించే హంసాకార తెప్పను సిద్ధం చేసి పూలు, విద్యుద్దీపకాంతులతో అలంకరిస్తున్నారు. పుష్కరిణి నలువైపులా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్నారు. పుష్కరిణి మధ్యలో స్వామి పూజలందుకునే మండపాన్ని విశేషంగా తీర్చిదిద్దారు. పుష్కరిణిలో నీరు ఎక్కువగా ఉండటంతో భక్తులు నీటి వరకు వెళ్లకుండా భారీ ఎత్తున బారికేడ్లు ఏర్పాటు చేశారు. పుష్కరిణి గట్టుపై సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. పుష్కరిణి వద్ద 15 మంది గజ ఈతగాళ్లు, రెండు బోట్లు, 15 లైఫ్ జాకెట్లను అందుబాటులో ఉంటాయని ఈఈ రాంబాబు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 25 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు గోపాలపట్నం ఎస్‌ఐ అప్పలనాయుడు చెప్పారు.

విజయవంతంగా ట్రయల్ రన్

తెప్పోత్సవాన్ని పురస్కరించుకుని సిద్ధం చేసిన హంసాకార తెప్పపై శుక్రవారం సాయంత్రం దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, వైదికులు, పోలీసులు ట్రయల్‌రన్ నిర్వహించారు. తెప్పపై పుష్కరిణి మధ్యలో ఉన్న మండపం వరకు వెళ్లి తెప్ప సామర్థ్యాన్ని పరిశీలించారు. ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఏఈవో ఇజిరోతు శ్రీనివాసరావు, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఎస్‌ఐ అప్పలనాయుడు ట్రయల్ రన్‌లో పాల్గొన్నారు.



వేణుగోపాలస్వామి అలంకరణలో అప్పన్న(ఫైల్)

ఉత్సవం నిర్వహణ ఇలా.. : స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి వేణుగోపాలస్వామి అలంకరణ చేసి శ్రీదేవి, భూదేవి సమేతంగా శుక్రవారం మధ్యాహ్నం 3.30గంటలకు సింహగిరి నుంచి కొండదిగువకు మెట్లమార్గంలో తీసుకొస్తారు. పుష్కరిణి వద్ద హంస వాహనంపై స్వామిని అధిష్ఠింపజేసి.. సాయంత్రం 5 గంటల నుంచి తెప్పోత్సవం నిర్వహిస్తారు. పుష్కరిణి మధ్యలో ఉన్న మండపం చుట్టూ మూడు సార్లు హంస వాహనానంతో ప్రదక్షిణ చేస్తారు. అనంతరం స్వామిని మండపంలో అధిష్ఠింపజేసి షోడశోపచార పూజలు నిర్వహిస్తారు. తదుపరి స్వామిని పుష్కరిణి సత్రం వద్దకు తీసుకొస్తారు. అక్కడ సర్వజనమనోరంజని వాహనంపై అధిష్ఠించి రాత్రి అడవివరం గ్రామంలో తిరువీధి నిర్వహిస్తారు. అనంతరం స్వామిని తిరిగి సింహగిరికి చేరుస్తారు.

ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించండి

- సైయంట్ వ్యవస్థాపక ఛైర్మన్ మోహన్‌రెడ్డి
- ఏయూ సందర్శన



డ్రీమ్‌వాల్ వద్ద సైయంట్ వ్యవస్థాపక ఛైర్మన్ బి.వి.ఆర్.మోహన్‌రెడ్డి, తదితరులు

ఏయూ క్యాంపస్: ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, దీని కోసం అవసరమైన వ్యవస్థను నిర్మించాలని సైయంట్ టెక్నాలజీస్ వ్యవస్థాపక ఛైర్మన్ బి.వి.ఆర్.మోహన్‌రెడ్డి సూచించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు స్ఫూర్తిని నింపేలా ఏర్పాటు చేసిన డ్రీమ్‌వాల్‌ను పరిశీలించారు. విభిన్న రంగాల్లో అత్యున్నత ప్రగతిని సాధించిన వారి చిత్రాలతో డ్రీమ్‌వాల్‌ను ఏర్పాటు చేయడం యువతలో స్ఫూర్తిని నింపుతుందన్నారు. ఏయూలో ఏర్పాటైన ఇంక్యుబేషన్ సెంటర్, నాస్‌కామ్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, ఫుడ్, ఫార్మా ఇంక్యుబేషన్, ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ తదితర కేంద్రాలను మోహన్‌రెడ్డి ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డితో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ నేడు డిగ్రీల కంటే నైపుణ్యాలు కలిగి ఉండడం ఎంతో ప్రధానమన్నారు. అదే సమయంలో అధ్యాపకుల్లో నైపుణ్యాలు పెంపొందించడానికి కృషి చేయాలన్నారు. విద్యార్థులు తమ ఆసక్తికి అనుగుణంగా కోర్సులను ఎంపిక చేసుకునే స్వేచ్ఛను కలిగించాలని సూచించారు. ఏయూలో క్రమశిక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ, ప్రతిభను ప్రోత్సహిస్తున్న విధానాన్ని వీసీ వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సహకారంతో వర్సిటీలో చేపట్టిన అభివృద్ధిని తెలియజేశారు. స్టార్టప్స్ ప్రగతి, చైర్ ప్రొఫెసర్స్, సీఎస్ఆర్ నిధుల సేకరణ తదితర అంశాలను వివరించారు. బి.వి.ఆర్.మోహన్‌రెడ్డి చైర్‌ను ఏయూలో ఏర్పాటు చేయాలని వీసీ కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్, ఇంక్యుబేషన్ సెంటర్ సీఈవో రవి ఈశ్వరపు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు స్థాయీ సంఘం ఆమోదం

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జీవీఎంసీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు స్థాయీ సంఘం సభ్యులు ఆమోదం తెలిపారు. స్థాయీ సంఘ సమావేశం శుక్రవారం స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన స్థాయీ సంఘ సమావేశ మందిరంలో జరిగింది. అజెండాలో 13 అంశాలు, అనుబంధ అజెండాలో 21 అంశాలు పొందుపరచగా.. అన్ని అంశాలు ఆమోదించారు. రూ.288.76 లక్షలతో 3, 4, 6 జోన్లలో రహదారులు, కల్వర్టులు, కమ్యూనిటీ హాళ్లు, బీటీ రోడ్లు, స్మార్ట్ వాటర్ డ్రెయిన్ల నిర్మాణం, నీటి శుద్ధి ఫిల్టర్ మరమ్మతులు, నీటి శుద్ధి భవనం మరమ్మతులు, అలాగే ఐదు విలీన గ్రామాల్లో 14 మంది పారిశుధ్య సిబ్బందికి రూ.31,73,664తో ఆప్కోస్ ద్వారా జీతాలు చెల్లింపు తదితర అంశాలను ఆమోదించినట్లు చైర్‌పర్సన్ తెలిపారు. జోన్-5లో గుల్లలపాలెం దుకాణం నంబర్ 8ను కాంట్రాక్టర్ అభ్యర్థన మేరకు కాంట్రాక్ట్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. జోన్-4లో 28 దుకాణాలు నిబంధనల మేరకు కాంట్రాక్ట్ పునరుద్ధరణ చేసేందుకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. టేబుల్ అజెండాల్లో 21 అంశాల్లో జీ-20 సదస్సు నేపథ్యంలో సుమారు రూ.702.19 లక్షల పనులకు స్థాయీ సంఘం ఆమోదించిందని చైర్‌పర్సన్ వెల్లడించారు. కార్యక్రమంలో కార్యదర్శి పి.నల్లనయ్య, స్థాయీ సంఘ సభ్యులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

క్రికెట్ ఆడుదాం.. ప్రతిభ చాటుదాం

ఈ నెల 22 సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ

SAKSHI | SAKSHI DIGITAL | MEDIA GROUP

SPL SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

District sponsor

CMR SHOPPING MALL The joy of life ANDHRAPRADESH | TELANGANA

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది. డిస్ట్రిక్ట్ స్పాన్సర్‌గా సీఎంఆర్ షాపింగ్‌మాల్ వ్యవహరిస్తోంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్ల పాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్-19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్-25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు. జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్ఠంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ : 70757 09205

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

క్లాసిఫైడ్స్ సాక్షి